ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 9 జూన్ 2025

మహిళాలోకం భగ్గు

- మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై ఆందోళన
- జగన్ పత్రిక కార్యాలయం ఎదుట నిరసన
- ఆ పేపర్ ప్రతుల దహనం..
- పలు స్టేషన్లలో కొమ్మినేని, కృష్ణంరాజుపై చర్యలకు ఫిర్యాదు

7


పెనుకొండలో జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు



మీ ఇళ్లలో మహిళలు లేరా..?

ఏంటి ఈ సంస్కార హీనమైన మాటలు..!
అమరావతి మహిళలకు
జగన్‌రెడ్డి, భారతిరెడ్డి క్షమాపణ చెప్పాలి
ఆ జర్నలిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలి
ఎమ్మెల్యే పరిటాల సునీత

7

జగన్.. క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కండువా మార్చడం

కష్టమే..!



చేరికలకు అనుమతి తప్పనిసరి
రంగులు మార్చే వలస పక్షులపై అప్రమత్తత
హైకమాండ్ ఆదేశాలతో టీడీపీలో భరోసా

పుట్టపర్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో పార్లమెంటుతోపాటు ఏడు శాసనసభ స్థానాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో శ్రేణుల్లో ఎక్కడో ఓచోట నైరాశ్యం అలుముకుంది. పార్టీ కండువా మార్చే వారికి ప్రాధాన్యం పెరిగిందని పలు నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణుల ఆవేదన. గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో టీడీపీ నేతలు, శ్రేణులను తీవ్ర ఇబ్బందులు, కేసులు పెట్టి వేధించిన వైసీపీ నేతలు ఇప్పుడు రక్షణ కోసం పార్టీ కండువాలు మార్చేస్తున్నారు. గత నెలలో జిల్లాలో నిర్వహించిన మహానాడు సభలో కూడా ఇదే విషయంపై ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఎవరిని పడితే వారిని చేర్చుకోవద్దనీ, ఒకవేళ చేర్చుకోవాల్సి వస్తే కేంద్ర కార్యాలయానికి ముందుగా తెలియజేయాలన్న టీడీపీ అధిష్ఠానం ఆదేశాలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర కార్యాలయం నుంచి అనుమతి ఇచ్చిన తరువాతే వారిని పార్టీలోకి ఆహ్వానించాలన్న ఆదేశాలతో వలస పక్షులకు చెక్‌పడుతుందా అన్న చర్చలకు దారితీస్తోంది.

రక్షణ కోసం రంగులు మార్చేసి..

ఇప్పటికే జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కొందరు వైసీపీ నేతలు.. టీడీపీతోపాటు బీజేపీ, జనసేన పార్టీల్లో చేరారు. మరి కొందరు ఆయా నియోజకవర్గాల్లో తామోస్తామంటూ సంప్రదింపులు సాగిస్తున్నారు. ఎన్నికల తరువాత పార్టీ బలోపేతం భాగంగా మున్సిపల్, మండల పరిషత్ పీఠాల కైవసం చేయడంతో కొన్ని నియోజకవర్గాల్లో చేరికలు ప్రోత్సహించారు. వైసీపీ నుంచి కండువా మార్చేసిన నియోజకవర్గాల్లో ముందు వరుసలో ధర్మవరం, మడకశిర ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో పెనుకొండ, కదిరి, పుట్టపర్తి హిందూపురం ఉంటాయి. ధర్మవరం నియోజక వర్గంలో గత ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులను తీవ్ర ఇబ్బందులు పెట్టిన వైపీపీ నాయకులు.. కూటమిలో భాగస్వామ్య పార్టీ బీజేపీలోకి చేరిపోయారు. టీడీపీ జెండా మోసిన కార్యకర్తలను తీవ్ర మనోవేదనలోకి నెట్టేస్తున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు.. పక్కచూపులు చూస్తూ, సంప్రదింపులు, రాయబారాలు సాగిస్తున్నారు.

ఏడాది దాటినా చేరికలు..

అధికారం చేపట్టి ఏడాది దాటినా వలస పక్షుల చేరికలు కొనసాగుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో వారిదే హవా సాగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అరాచక వైపీపీ పాలన అంతమై ఈనెల 4న కూటమి పార్టీల చరిత్రాత్మక విజయోత్సవాల్లో జిల్లాలో కూటమి పార్టీలు సమన్వయంగా కార్యక్రమాలు నిర్వహించలేకపోయాయన్న వాదన ఉంది. ధర్మవరం నియోజకవర్గంలో విజయోత్సవాలకు టీడీపీ శ్రేణులు దూరంగా కనిపించాయి. మరికొన్ని నియోజకవర్గాల్లో అంతంత మాత్రగానే కన్పించారంటే టీడీపీ శ్రేణులు ఏస్థాయిలో మదనపడుతున్నారో తెలుస్తోంది. టీడీపీ ఆదేశాల లాగే కూటమిలో భాగస్వాములైన బీజేపీ, జనసేన పార్టీల్లో చేరి టీడీపీ శ్రేణులు ఇబ్బంది పెట్టేందుకు కండువా మర్చేస్తున్న వైసీపీ నేతల చేరికలపై కూడా పునరాలోచించాలన్న చర్చ నడుస్తోంది.

అనంత ప్రతిభ

ఈఏపీసెట్‌లో ఉమ్మడి జిల్లాకు ర్యాంకులు

- అగ్నిహోత్రికి రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు
- ఇంజనీరింగ్‌లో 11,308 మంది..
- అగ్రికల్చర్, ఫార్మసీలో 4,801 మంది పాస్..
- ఈసారి బాలురదే పైచేయి

7

అగ్నిహోత్రికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు




బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థినులు

సత్యసాయి ప్రేమతత్వం.. శాంతిధామం..

- శ్రీసత్యసాయి సేవాసంస్థల కోఆర్డినేటర్ శశిబాల
- ముగిసిన మహిళా సదస్సు

పుట్టపర్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమతత్వం.. శాంతిధామమని శ్రీసత్యసాయి సేవాసంస్థల కోఆర్డినేటర్ శశిబాల పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి గ్లోబల్ మహిళా సదస్సు చివరిరోజు ఆదివాం ఘనంగా సాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో విద్యార్థుల వేదపఠనంతో సదస్సు ప్రారంభమైంది. శ్రీసత్యసాయి సేవాసంస్థల కోఆర్డినేటర్ శశిబాల మాట్లాడుతూ.. సత్యసాయి సేవ, ఆధ్యాత్మిక బోధనల స్ఫూర్తితో సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా సత్యసాయి సేవా సంస్థలు సామాజిక సేవ చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం బావికాస్ విద్యార్థినులు బ్యాండ్, భక్తి గీతాల ఆలాపనతో అలరించారు. చివరిరోజు సదస్సులో మూడువేల మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన మహిళా ప్రతినిధులు

సస్యరక్షణ చర్యలతో చీడపీడల నివారణ

- శాస్త్రవేత్త జాహ్నవి


చింతలపల్లిలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త జాహ్నవి

ధర్మవరంరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వేరుశనగ, కంది, శనగ, బత్తాయి పంటల్లో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే చీడ, పీడలను అరికట్టి, పంటలను కాపాడుకోవచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జాహ్నవి.. రైతులకు సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞానకేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్తల బృందం ఆదివారం మండలంలోని చింతలపల్లి, గొట్లూరు గ్రామాల్లో వికసిత కృషిసంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల్లో చీడ, పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు, విత్తనాల లభ్యత, కేవీకే సేవలు, డ్రోన్ పిచికారీ, కోళ్ల, పొట్టేళ్ల పెంపకం యాజమాన్య పద్ధతులు తదితర ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.

శాస్త్రవేత్త జాహ్నవి మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సలహా మేరకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలు సాగుచేసుకోవడం లాభదాయకమన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చందన, డాక్టర్ రఘుకరన్, పశువైద్యాధికారి శేఖర్, ఏఓ ముస్తఫా, ఉద్యానవన అధికారి అమరేశ్వరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు కాటమయ్య పాల్గొన్నారు.


కారు, ద్విచక్రవాహనం ఢీ

- ఇద్దరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

7

కొవిడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బెడ్లు





వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అప్రమత్తం

అందుబాటులోకి రానున్న కరోనా కిట్లు
ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యశాఖకు ఆదేశాలు

పురంలో కొవిడ్ సెంటర్..!

హిందూపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య శాఖ అప్రమత్తమైంది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టింది. హిందూపురంలో కొవిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సరిగ్గా ఐదేళ్ల క్రితం ప్రపంచ దేశాలను వణికించిన మహమ్మారి కరోనా మళ్లీ భయపెడతోంది. రాష్ట్రంలోని కరోనా మొదటి కేసు హిందూపురంలో నమోదు కావడం, కరోనా మృతి కూడా ఇక్కడే మొదటిదే కావడం అప్పట్లో కొవిడ్ సమయంలో సంచనలం రేకెత్తించింది. ఇప్పటికీ ఆ లాక్‌డౌన్, రెడ్‌జోన్, ఆరెంజ్ జోన్, బ్లాక్‌స్పాట్లను పురం ప్రజలు మరచిపోలేకున్నారు. ఈ తరుణంలో మరోసారి కరోనా వ్యాప్తి నేపథ్యంలో హిందూపురం ప్రజల్లో వణకు పుట్టింది. అప్పట్లో పురంలో పదుల సంఖ్యలో మృతిచెందారు. ఒకే రోజు హిందూపురం ఆస్పత్రికి పది మందికిపైగా చనిపోయిన సందర్భాలున్నాయి. దీంతో హిందూపురం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎంతో మంది అయిన వారిని వదులుకున్నారు. ఈ పరిస్థితుల్లో కరోనాపై అప్రమత్తం కావాలని ప్రభుత్వం ఆదేవించడంతో వైద్యశాఖ అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కొవిడ్ కేసులు నమోదవడంతో ఈ ప్రాంత ప్రజలను ఆందోళనకు లోనుచేస్తోంది. ప్రస్తుతం వైరస్‌తో ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యశాఖ అధికారులు చెబుతున్నా.. గత కరోనా నాటి జ్ఞాపకాలను తలచుకుని భయపడిపోతున్నారు.

అందుబాటులోకి రానున్న కిట్లు

కరోనా కేసులు నమోదవుతుండటంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్కులు ధరించేలా ఇప్పటికే వైద్య శాఖాధికారుల ఆదేశాలు జారీ చేశారు. కరోనా టెస్టులు చేసేందుకు అవసరమైన కిట్లను ప్రభుత్వం త్వరలోనే ఇవ్వనున్నట్లు సమాచారం. జలుబు, దగ్గు ఉంటే అటువంటి వారిని వారం రోజుల పాటు హోంక్వారంటైన్‌లో ఉంచాలని ఆదేశించింది. అప్పటికీ తగ్గకపోతే కరోనా టెస్టు చేయించి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలా ఉత్తర్వులిచ్చారు. కొవిడ్ లక్షణాలు కనబడితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు. కొవిడ్ ఒకటి, రెండు విడతల్లో హిందూపురాన్ని అతలాకుతలం చేసింది. దీనిని దృష్టిలో పెట్టుకుని, అధికార యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తమవుతోంది. హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో కొవిడ్ సెంటర్‌గా మార్చారు. ఇందులో పది బెడ్లు ఉంటాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్న తెలిపారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కొవిడ్ సెంటర్

ఇప్పటికే...

దేశంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. పాజిటివ్ కేసులు రాష్ట్రంలో నమోదవడంతో వైద్య ఆరోగ్యశాఖ తగిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. వైద్యులను అలర్ట్ చేయడంతోపాటు ప్రైవేటు వైద్యశాలల యాజమాన్యాలతో ఉన్నతాధికారులు సమీక్షించారు. ప్రజలకు పూర్తిస్థాయిలో కొవిడ్‌పై అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



కాంస్యం కైవసం


శ్రీసత్యసాయి జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

ధర్మవరంరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం ముగిశాయి. సెమీస్‌లో అనంతపురంతో శ్రీసత్యసాయి జిల్లా జట్టు తలపడింది. నిర్ణీత సమయంలో ఇరు చెట్లు చెరో గోల్ చేయడంతో పెనాల్టీ షూటౌట్ తప్పనిసరైంది. ఇందులో శ్రీసత్యసాయి జట్టు 2-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. అనంతరం మూడోస్థానం కోసం ప్రకాశం జిల్లా జట్టుతో తలపడింది. 2-0 గోల్స్‌తో గెలుపొంది కాంస్య పతకం సాధించింది. జట్టును జిల్లా హాకీ మేనేజర్ అరవింద్‌గౌడ్, కోచ్ మారుతి అభినందించారు. జిల్లా జట్టుకు చెందిన హేమ టోర్నీ బెస్ట్ డిఫెండర్ అవార్డు దక్కించుకున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కదిరిఅర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి ఖాద్రీ కొండపై చెంచులక్ష్మి సమేతంగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి గిరిప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం గిరి ప్రదక్షిణ చేశారు. కుమ్మరవాండ్లపల్లి వద్ద భక్తులకు తాగునీరు, అల్పాహారం అందచేశారు.

రేపు పుట్టపర్తికి వైఎస్ షర్మిల రాక

పుట్టపర్తి టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 10న పుట్టపర్తి రానున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా సత్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయిఆరామంలో జరిగే జిల్లా స్థాయి కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా ఆమె రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు వివరించారు. ఆమె పర్యటను విజవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

క్రైం కార్నర్

కారు, ద్విచక్రవాహనం ఢీ

● ఇద్దరి మృతి ● మరొకరికి తీవ్రగాయాలు


షేక్‌మహమ్మద్ సుహేల్, మహమ్మద్ లతీఫ్ (ఫైల్)

నంబులపూలకుంట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కం వారిపల్లి సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తనకల్లు మండలంలోని మారెప్పగారిపల్లికి చెందిన షేక్‌మహమ్మద్ సుహేల్, మహమ్మద్ లతీఫ్, తౌసీఫ్ తిమ్మమ్మ మర్రిమానును సందర్శించడానికి ద్విచక్రవాహనంలో బయలు దేరారు. తిమ్మమ్మ మర్రిమాను నుంచి కొక్కంటి క్రాస్‌కు వస్తున్న కారు ముక్కంవారిపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ మహమ్మద్ సుహేల్ (16) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మహమ్మద్‌లతీఫ్(17)ను కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశాడు. తౌసీఫ్‌ను 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుహేల్ పదో తరగతి, లతీఫ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చేరాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

24 కిలోల గంజాయి సీజ్


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ సిబ్బంది ఉమ్మడిగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కందుకూరు కొట్టాలకు చెందిన బిస్కెట్ ఫయాజ్, బిస్కెట్ మహబూబ్‌పీరా భువనేశ్వర్ నుంచి అనంతపురానికి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద ఉన్న దాదాపు 24 కిలోల గంజాయి ఉన్న రెండు బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేశ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. గంజాయి విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని వారు వివరించారు.

ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

● 3న అదృశ్యం.. 4న ఫిర్యాదు
● పట్టించుకోని పోలీసులు ● 7న మృతదేహం లభ్యం


తన్మయి (ఫైల్)

అనంతపురం క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన లక్ష్మీపతి కుమార్తె తన్మయి(19)నగరంలో వివేకానంద కళాశాలలో ఇంటర్ సెకెండియర్ చదివింది. సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 3వతేదీ రాత్రి కడుపునొప్పిగా ఉందని కూల్‌డ్రింక్స్ తెచ్చుకుంటానని చెప్పి బయటకెళ్లింది. ఎంతసేపైనా ఇంటికి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికిన తల్లిదండ్రులకు కనిపించకపోవడంతో 4వతేదీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 7న కూడేరు మండలం గొట్కూరు సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని శవం ఉందని పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కూడేరు సీఐ రాజు సిబ్బందితో కలిసి పరిశీలించారు. పోలీసులు గుర్తు తెలియని యువతి మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. తలపై తీవ్రగాయాలైనట్లు నిర్ధారించారు.

జిల్లా వ్యాప్తంగా 72 మిస్సింగ్ కేసులు...

మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు తొలుత 26 నుంచి 28 ఏళ్ల వయసు ఉండవచ్చని భావించారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. జిల్లా మొత్తంపై 72 మంది మహిళలు అదృశ్యమైనట్లు తేలింది. అందులో ఆ వయసు యువతి లేరన్నట్లు నిర్ధారించారు. చివరకు అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యమైన యువతికి సంబంధించి ఆరా తీశారు. తల్లిదండ్రులను పిలిపించి పరిశీలించారు. దుస్తులు, చెప్పుల ఆధారంగా తమ కూతురేనని నిర్ధారించుకున్నారు. కుమార్తె మృతదేహాన్ని ఆ స్థితిలో చూసి బోరుమన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

పోలీసులు మృతదేహాన్ని తల్లిదండ్రులు గుర్తించడంతో ఆదివారం మార్చురీ గదిలో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ తల్లిదండ్రులు మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. అదృశ్యమైన మరుసటి రోజే ఫిర్యాదు చేశామని, పోలీసులు కాల్‌లిస్ట్ తీస్తామని చెప్పి కాలయాపన చేశారని వాపోయారు. ముందుగానే గుర్తించి ఉంటే తమ కుమార్తె బతికి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తెను అలా చేసిన వాడిని శిక్షించాలని వేడుకున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు..

విద్యార్థి హత్యకేసును విచారణ చేపడుతున్న వన్‌టౌన్ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిని విచారిస్తున్నట్లు సమాచారం. సీసీ టీవీ ఫుటేజీలు, కాల్ రికార్డ్స్‌పై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తగ్గిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన వారంతపు పశువుల సంత ఆదాయం ఈవారం తగ్గింది. బక్రీద్ పండుగ నేపథ్యంలో గత రెండు వారాలు రూ.5లక్షలకు పైగా మార్కెట్‌కు ఆదాయం వచ్చింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.1,89,610, ఆదివారం జరిగిన ఎద్దులు, ఎనుముల సంతతో రూ.60,100 మార్కెట్‌కు ఆదాయం వచ్చింది. రెండురోజుల సంతతో రూ.2,49,710 మార్కెట్‌కు వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

ఉద్యోగోన్నతులకు దూరం..!

● ముగిసిన ప్రమోషన్ల ప్రక్రియ
● మూడు రోజులుగా రాత్రింబవళ్లు పడిగాపులు
● ఖాళీలు 663.. భర్తీ 429..
● దూర ప్రాంతాలకు వెళ్లడం ఇష్టంలేకే..

అనంతపురం విద్య, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల ప్రమోషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. మూడు రోజులుగా రేయింబవళ్లు సాగిన ఈ తంతు ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు ముగిసింది. చాలా పోస్టులకు ప్రమోషన్లు తీసుకోడానికి ఉపాధ్యాయులు విముఖత చూపారు. దగ్గర ప్రాంతంలో ఖాళీలు దొరక్కపోవడంతో... వందలాది మంది టీచర్లు ప్రమోషన్ల తీసుకోడానికి నసేమిరా అంటూ నాట్ ఆప్షన్ ఇచ్చి వెళ్లిపోయారు. జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్, ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో 663 ఖాళీలకుగాను, 429 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి.

> ఉద్యోగం చేసే వారెవరైనా ఉన్నత స్థానం కోరుకోవడం సహజం. కానీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇస్తామంటున్నా వద్దంటున్నారు. సెకెండరీ గ్రేడ్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టులకు ఉద్యోగోన్నతికి అవకాశం కల్పిస్తున్నా.. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండడంతో చాలా మంది వద్దని రాసిచ్చి వెళ్లిపోతున్నారు.

తెల్లవారుజాము వరకూ...

ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయ పోస్టులకు మూడు రోజులపాటు ప్రమోషన్లు నిర్వహించారు. జడ్పీలో 304, మున్సిపాలిటీల్లో 304, మున్సిపల్ కార్పొరేషన్‌లో 52, గవర్నమెంట్‌లో 3 పోస్టులకు మూడు రోజులుగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సిలింగ్ నిర్వహించారు. చాలా మంది దగ్గరి స్కూళ్లు, తాము కోరుకున్న ప్లేసులు దొరకడం లేదంటూ దూరంగా ఉంటూ వచ్చారు. 'రండి సార్, రండి మేడం.....ప్రమోషన్లు తీసుకోండి' అంటూ టీచర్లను బతిమాలే పరిస్థితి అధికారులకు తప్పలేదు. కొన్ని పోస్టులకు 1:10 నిష్పత్తిలో టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలవాల్సి వచ్చింది. అభ్యర్థులు రాకపోవడంతో..ఫోన్లు చేసి పిలిచారు. దీంతో మూడు రోజులు అర్ధరాత్రి దాటి, తెల్లవారుజాము 3 గంటలకు, 5 గంటల వరకూ కౌన్సెలింగ్ సాగింది. చివరికి వచ్చినవాళ్లకు ప్రమోషన్ల ఇచ్చి ముగించారు. ప్రమోషన్ పోస్టులు 663 ఖాళీల్లో యాజమాన్యాల వారీగా చూస్తే... గవర్నమెంట్‌లో 1, జడ్పీలో 211 పోస్టులు, మున్సిపాలిటీల్లో 189, మున్సిపల్ కార్పొరేషన్‌లో 28 పోస్టులు భర్తీ చేశారు.

మీడియం, సబ్జెక్టుల వారీగా పోస్టుల వివరాలు

ప్రైమరీ హెచ్‌ఎం(కన్నడ మీడియం) 1, ప్రైమరీ హెచ్‌ఎం (తెలుగు మీడియం) 130, ప్రైమరీ హెచ్‌ఎం (ఉర్దూ) 10 పోస్టులు భర్తీ చేశారు. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్లు(లాంగ్వేజస్) ఇంగ్లీష్ 46 పోస్టులు, హిందీ 1, తెలుగు 1, ఉర్దూ 1, స్కూల్ అసిస్టెంట్లు (నాన్‌లాంగ్వేజస్) బయాలజీ 38 (తెలుగు మీడియం), ఉర్దూ మీడియంలో 4, గణితం (తెలుగుమీడియం) 80, ఉర్దూ మీడియం 5, ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగుమీడియం) 6, ఫిజికల్ సైన్స్‌లో 46 (తెలుగు మీడియం), కన్నడ మీడియంలో 1, ఉర్దూ మీడియంలో 1, సోషల్‌లో 50 (తెలుగుమీడియం), కన్నడ మీడియంలో 2, ఉర్దూ మీడియంలో 6 పోస్టులకు ప్రమోషన్లు ఇచ్చారు. చాలా ఖాళీలు అలాగే మిగిలిపోయాయి.


పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల కౌన్సిలింగ్ తక్కువగా వచ్చిన టీచర్లు

మహిళాలోకం భగ్గు


జగన్ పత్రిక కార్యాలయం ఎదుట నినదిస్తున్న తెలుగు మహిళలు

అనంతపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 'వేశ్యల రాజధాని అమరావతి' అంటూ జగన్ చానల్ డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలపై మహిళాలోకం భగ్గుమంది. జిల్లావ్యాప్తంగా ఆదివారం తెలుగు మహిళలు ఆందోళనలకు దిగారు. జగన్ మీడియాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్ మహిళాలోకాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తూ యాంకర్‌గా వ్యవహరించిన మరో జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుతోపాటు చానల్ యజమాని భారతీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఉమ్మడి అనంత జిల్లా జగన్ పత్రిక యూనిట్ కార్యాలయం ఎదుట తెలుగు మహిళ రాష్ట్ర నేతలు స్వప్న, సంగా తేజస్విని ఆధ్వర్యంలో పలువురు తెలుగు మహిళలు నిరసనకు దిగారు. ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. తెలుగు మహిళలను అరెస్టు చేసి, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైఎస్ భారతి, జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఉరవకొండలో నిరసనకు దిగారు. రాప్తాడులో తెలుగు మహిళలు పోలీసు స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళ్యాణదుర్గంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. సీఐ యువరాజుకు ఫిర్యాదు అందజేశారు. తాడిపత్రిలో మహిళా కౌన్సిలర్లు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెనుకొండలో టీడీపీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడే జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఆ తర్వాత ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. తెలుగు మహిళల ఆందోళనలతో జిల్లా అట్టుడికింది.

జగన్.. క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల: వైసీపీ నేత జగన్‌రెడ్డి.. రాష్ట్ర మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతు కుంటుబాల్లోని మహిళల పట్ల జగన్ చానల్‌లో చేసిన అసభ్య వ్యాఖ్యలను ఖండించారు. ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ చేస్తున్న నీచ రాజకీయాలను అందరూ గమనిస్తున్నారని వివరించారు.

మీ ఇళ్లలో మహిళలు లేరా..?
- ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్: సొంత చానల్ డిబేట్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు చేసిన వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి, భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. జగన్ చానల్ డిబేట్‌లో రాజధాని అమరావతిపై జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాజధాని కోసం తమ భూములను ఇచ్చిన గొప్ప మనుసున్న వారు అమరావతి ప్రాంత మహిళలన్నారు. ఆ తర్వాతా అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాజధానిలో విధ్వంసం సృష్టిస్తుంటే అమరావతి ప్రాంత మహిళలు 1630 రోజులు ఉద్యమం చేశారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు దేవతల రాజధాని అంటే కృష్ణంరాజు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఖండించాల్సిన కొమ్మినేని శ్రీనివాసరావు కనీస విజ్ఞత లేకుండా నవ్వుతున్నారన్నారు. మహిళలపై ఇంత నీచంగా మాట్లాడితే చర్యలు తీసుకోవడంలో ఆలస్యం ఎందుకని ప్రశ్నించారు. కొమ్మినేని, కృష్ణంరాజు ఇళ్లలో మహిళలు ఉన్నారనే విషయాన్ని మరచిపోయారా అని నిలదీశారు. వెంటనే వారిని అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభకోణాలపై ప్రజా దృష్టి మళ్లించడానికే అమరావతిపై ఈ దుర్మార్గపు దాడి చేయించారన్నారు.

మీ ఇంటి అమ్మాయిని ఇలాగే రోడ్డుకు లాగుతారా..?

● ప్రకాష్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఫైర్

అనంతపురం రూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలో బాలికపై అఘాయిత్యం జరిగితే ఆ విషయాన్ని రోడ్డుకెక్కేలా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. 'మీ ఇంటి అమ్మాయికి ఇలా జరిగితే ఇంత బహిరంగంగా మాట్లాడతారా' అంటూ నిలదీశారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదివారం మీడియాతో మాట్లాడారు. బాధిత బాలికను ఫోన్‌లో ఆమె పరామర్శించి.. ధైర్యం చెప్పారు. బాధిత బాలిక తల్లితో కూడా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆ బిడ్డకు జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. బాలిక అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు దుర్మార్గులు దారుణానికి ఒడిగట్టారన్నారు. విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తూ పార్టీలకు ఆపాదిస్తూ ప్రకాష్‌రెడ్డితోపాటు వైసీపీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారన్నారు. ఇప్పటికే ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిని అరెస్టు చేస్తున్నారనీ, ఇందులో వైసీపీ వారు కూడా ఉన్నారని దానికి ప్రకాష్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు మాని ఆ బాలికకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ సుధాకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ.!

● 14 మంది ఏపీఎం, 42 మంది సీసీల ట్రాన్స్‌ఫర్‌కు సెర్ప్ ఆదేశాలు
● సస్పెండైన వారిపైనే ఒత్తిడి
● ప్రభుత్వం మారినా వారిదే హవా


డీఆర్‌డీఏ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-సెర్ప్ ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని సెర్ప్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గత 15 ఏళ్లలో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్ వేటు పడిన ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఉత్తర్వుల్లో సెర్ప్ పేర్కొంది. సెర్ప్ ఆదేశాలను పాటిస్తారా లేక ఐదేళ్ల ఒకే స్థానంలో సర్వీస్ పూర్తి చేసిన వారిని బదిలీ చేస్తారా అనేది ఉత్కంఠ నెలకొంది. గడిచిన 15 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో 14 మంది ఏపీఎంలు, 42 మంది సీసీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. వారిని అంతర్ జిల్లా బదిలీలు చేస్తారనే ప్రచారం సాగుతోంది. గత సోమవారం టీటీడీసీలో జరిగిన ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్‌ను మధ్యలోనే నిలిపివేశారు. 14 మంది ఏపీఎంలు, 42 మంది సీసీల జాబితాను సెర్ప్‌కు పంపారు. అనంతపురం జిల్లాలో ఆరుగురు, శ్రీసత్యసాయి జిల్లా ఎనిమిది మంది మొత్తం 14మంది ఏపీఎంలు క్రమశిక్షణా చర్యలు తీసుకున్న వారిలో ఉన్నారు. సీసీలు అనంతపురం జిల్లా 20 మంది, శ్రీసత్యసాయి జిల్లా 22 మంది మొత్తం 42 మంది జాబితాలో ఉన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిలో ఉమ్మడి జిల్లా మొత్తానికి తలుపులలో పనిచేస్తున్న ఏపీఎం బాబ్జీ మాత్రమే ఉన్నారు. సీసీల విషయానికొస్తే.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 22 మంది ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిలో ఉన్నారు.

మళ్లీ వారిదే..

వైసీపీ ప్రభుత్వంలో డీఆర్‌డీఏలో పెత్తనం చెలాయించిన వాళ్లే కూటమి ప్రభుత్వంలోనూ ఆధిపత్యాన్ని కొనసాస్తున్నారు. వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలోని అప్పటి ఓ ప్రజాప్రతినిధి అండతో ప్రాధాన్యత స్థానాల్లో ఉంటూ నడిపించిన ఉద్యోగులే తిరిగి కీలకపోస్టుల్లో ఉంటున్నారు. గత అక్టోబరులో జరిగిన బదిలీల్లో స్థానచలనం పొందిన ఉద్యోగులు తిరిగి తాము కోరుకున్న స్థానాల్లోకి చేరాలని తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో పనిచేస్తూ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ మండలానికి బదిలీ అయిన ఓ ఉద్యోగి తిరిగి జిల్లా కేంద్రానికి రావాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. సత్యసాయి జిల్లాలో పనిచేస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఉద్యోగి అనంతపురానికి రావడానికి ఆపసోపాలు పడుతున్నట్లు తెలిసింది. ఇందుకు సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న కీలక అధికారుల సహకారం అందిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. పింఛన్ల పునఃపరిశీలనలో ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగులను కాపాడిన ఆ కీలక అధికారి బదిలీల్లో కూడా చక్రం తిప్పుతున్నారనే చర్చ సాగుతోంది.

సెర్ప్ ఆదేశాల మేరకు బదిలీలు



సెర్ప్ ఆదేశాల మేరకు ఉద్యోగుల బదిలీలు ఉంటాయి. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులతో పాటు గడిచిన 15 ఏళ్లలో క్రమశిక్షణా చర్యలు తీసుకున్న ఉద్యోగుల జాబితాను సెర్ప్‌కు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు ఏపీఎంలు, సీసీల జాబితాలు పంపాం. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగుల జాబితాను సిద్ధం చేశాం. వీటితో పాటు రిక్వెస్ట్, స్పౌజ్ ఉద్యోగుల వివరాలను కూడా నమోదు చేశాం. సెర్ప్ జారీ చేసిన నిబంధనల ప్రకారం బదిలీలు జరుగుతాయి. -శైలజ, పీడీ, డీఆర్‌డీఏ

అనంత ప్రతిభ

● ఈఏపీసెట్‌లో ఉమ్మడి జిల్లాకు ర్యాంకులు
● అగ్నిహోత్రికి రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు
● ఇంజనీరింగ్‌లో 11,308 మంది.. అగ్రికల్చర్, ఫార్మసీలో 4,801 మంది పాస్..
● ఈసారి బాలురదే పైచేయి..


జశ్వంత్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీసెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతపురం నగరానికి చెందిన నితిన్ అగ్నిహోత్రి రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించి, జిల్లా ఖ్యాతిని చాటారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి 23,743 మంది విద్యార్థులకుగాను 16109 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 11,308 మంది ఇంజనీరింగ్‌లో 4,801 మంది అగ్రికల్చర్, ఫార్మసీలో ఉత్తీర్ణులయ్యారు. ఇంజనీరింగ్ ఫలితాల్లో ఈసారి బాలురే పైచేయి సాధించారు. 5,895 మంది బాలురు, 5,413 మంది బాలికలు పాసయ్యారు. ఫార్మసీలో 1,197 మంది బాలురు, 3,604 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

టాప్‌లేపిన విద్యార్థులు..: ఈఏపీసెట్‌లో 40 మంది విద్యార్థులు 1500లోపు ర్యాంకులు సాధించి ఉమ్మడి జిల్లా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. ఇంజనీరింగ్ పరీక్షల్లో స్టేట్ ఐదో ర్యాంకుతో నితిన్ అగ్నిహోత్రి అదరగొట్టాడు. మొరవకొత్తపల్లికి చెందిన 87వ ర్యాంకుతో సత్తాచాటాడు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల్లోనూ విడపనకల్లుకు చెందిన అశుతోష్ 19వ ర్యాంకుతో దుమ్మురేపాడు. రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని చాటారు. ఇంజనీరింగ్‌లో శశిధర్‌రెడ్డి 133, విశాల్ 151, అనిరుధ్ 236, రేవంత్ 259, సర్వజిత్ 263, ఓమ్ కిరణ్ 264, షారన్ మౌర్య 373వ ర్యాంకుతో మెరిశారు. అగ్రికల్చర్, ఫార్మసీలో అశుతోష్ 19, తరుణ్ తేజ 25, సైనారెడ్డి 71 వందలోపు ర్యాంకులు సాధించారు.

ఏఐలో ఇన్నోవేషన్
-నితిన్ అగ్నిహోత్రి, ఇంజనీరింగ్ 5వ ర్యాంక్

ప్రపంచాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ(ఏఐ)లో ఇన్నోవేషన్‌ను క్రియేట్‌చేసి టెక్నాలజీని మరింత సులువుగా ప్రజలకు అందించేందుకు కృషిచేస్తాను. మాది అనంతపురం. అమ్మ కళ్యాణి గృహిణి కాగా నాన్న శ్రీకాంత్ బిల్డర్‌గా పనిచేస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 183 ర్యాంకువచ్చింది.

సివిల్ సర్వీసెస్...
-జస్వంత్‌రెడ్డి, ఇంజనీరింగ్ 87వ ర్యాంక్

సివిల్ సర్వీసెస్ సాధించి పేదలకు ప్రభుత్వ సేవలందించాలని ధ్యేయంగా పెట్టుకున్నాను. మాది హిందూపురం. అమ్మ మాలతీ ఎల్ఆర్జీలో టీచర్‌గాను. నాన్న శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఐఐటీలో 707 ర్యాంక్ వచ్చింది. కరగ్‌పూర్‌లో ఐఐటీ సీఎస్‌లో సీటు వస్తుంది.

వైద్యశాఖలో బదిలీల షాక్..!

● ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌పై వేటు
● ఒంగోలుకు మాణిక్యాలరావు, కడపకు వెంకటేశ్వరరావు..
● అనంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా కేవీవీ సత్యనారాయణ

అనంతపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో అనూహ్యంగా ఉన్నతాధికారుల బదిలీలతో ఆ శాఖ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. తొలుత కిందిస్థాయి డాక్టర్లు, ఇతర విభాగాల ఉద్యోగులు, తర్వాత వైద్యాధికారుల బదిలీలు ఉంటాయనే ప్రచారం సాగింది. ఊహించని విధంగా వైద్యాధికారులపై బదిలీ వేటువేయడం ఆ శాఖలో ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆదివారం రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ బదిలీల ఉత్తర్వులు జారీచేశారు. అనంత జిల్లా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావును ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావును కడప జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావుకు సంబంధించి కళాశాలలో జరుగుతున్న వ్యవహారాలు, ఆరోపణల నేపథ్యంలో బదిలీ అవుతారని చర్చలు వినిపించాయి. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు రాష్ట్ర వైద్యశాఖ అడిషనల్ డీఎంఈగా ఉద్యోగోన్నతి పొందుతున్నారని చర్చలు సాగాయి. మరోవైపు ఆయన సర్వీస్ ఏడాది ఉండడంతో జిల్లాలోనే కొనసాగి ఉద్యోగ విరమణ చేస్తారని ఊహించారు. అనంత వైద్యకళాశాలకు కొత్త ప్రిన్సిపాల్‌గా గుంటూరు మెడికల్ కాలేజ్‌లో న్యూరో సర్జరీ ప్రొఫెసర్ కేవీవీ సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయి. జిల్లా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ నియామకం జరగలేదు. దీంతో ఎవరిని సూపరింటెండెంట్‌గా నియమిస్తారోనని ఉత్కంఠగా చూస్తున్నారు.

టీచర్లను ఇబ్బంది పెట్టొద్దు

ఐక్యవేదిక నాయకులు.. డీఈఓ కార్యాలయం ముట్టడి


నిరసన తెలుపుతున్న టీచర్లు, నాయకులు

అనంతపురం విద్య, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు డీఈఓ కార్యాలయం ముందు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, వెబ్ కౌన్సెలింగ్ వద్దు అంటూ నినాదాలు చేశారు. సుమారు గంట పాటు రోడ్డుపై నిరసన తెలిపారు. డీఈఓ ప్రసాద్‌బాబు వచ్చి మాట్లాడినా.. నాయకులు వినిపించుకోలేదు. తర్వాత డీఈఓ కార్యాలయంలో కాసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహిస్తామని చెప్పి, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ అనడం సరికాదని మండిపడ్డారు. టీచర్లను ఇబ్బంది పెడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తర్వాత టీచర్ల, సంఘాల నాయకులను పోలీసులు శాంతింపజేసి కార్యాలయం నుంచి బయటకు పంపారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు నాగిరెడ్డి, వెంకటరత్నం, రమణారెడ్డి, శ్రీధర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, లింగమయ్య, శ్రీనివాస్ నాయక్, విశ్వనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌని పాతిరెడ్డి, సిరాజుద్దీన్, వెంకటేషులు, జయచంద్రారెడ్డి, గోవిందరాజులు, ఎర్రిస్వామి, రవీంద్ర, జయరాం నాయక్, రామాంజనేయులు, ఓబులేసు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

నల్లచెరువు (కదిరి), జూన్8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈర్యాలీలో సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు అన్ని శాఖాల అధికారులు, సిబ్బంది, ప్రజలు, రాజకీయ నాయకులు పాల్గొనాలని కోరారు.

కొత్తచెరువు సీఐగా మారుతీశంకర్


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

కొత్తచెరువు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా మారుతీశంకర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఐగా పనిచేసిన ఇందిరను ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్‌కు అప్పగించారు. అయితే కొత్తచెరువు సమస్యాత్మక కేంద్రం కావడంతో ఎస్పీ వి. రత్న వీఆర్‌లో ఉన్న మారుతీశంకర్‌ను కొత్తచెరువు అప్‌గ్రేడ్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లిలో గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్మించిన చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి, తెలుగుయువత నాయకుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

తనకల్లు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలవారిపల్లిలో ఈనెల 3న నిషాంత్ అనే చిన్నారి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణం సమీపంలో ఉన్న నీటి తొట్టిలో పడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం ముత్యాలవారిపల్లికి వెళ్లి, చిన్నారి తల్లిదండ్రులు సంధ్యారాణి, గిరీష్ బాబు దంపతులను పరామర్శించారు. బాలుడి మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తమ కుమారుడు మృతిచెందేందుకు అంగన్‌వాడీ సిబ్బందే కారణమని వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన పరిశీలించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని అక్కడే ఉన్న ఎస్‌ఐ గోపికి సూచించారు. ఆయనతోపాటు నాయకులు రమణయ్య, ఆంజనేయస్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, చెన్నక్రిష్ణ, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ధర్మవరంరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో ఆదివారం రోటరీ క్లబ్, మిడ్‌టౌన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరు శంకరకంటి ఆసుపత్రి వారిచే నిర్వహించిన ఈ శిబిరానికి అనంతపురం అన్నపూర్ణ రెడీ మిక్స్ కాంక్రీట్ చంద్రశేఖర్ సహకారం అందించారు. 175మందికి కంటిపరీక్షలు నిర్వహించగా అందులో 136 మంది కంటి శస్త్రచికిత్సలకు ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జయసింహ, వైస్ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, సభ్యులు శివయ్య, ప్రసన్నకుమార్, కొండయ్య, రమేష్, సుదర్శనగుప్తా, మనోహర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: మండలంలోని గౌనకపేట క్రాస్ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరానికి మంచి స్పందన లభించింది. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు అమరనాథ్‌రెడ్డి, వెంకటేష్, క్రిష్ణవేణి, యాదమ్మ చికిత్సలు చేశారు. ఈ శిబిరంలో వందమందికి చికిత్సలు చేయగా, వీరిలో 60మందిని శస్త్రచికిత్సలకు రెఫర్ చేసినట్లు కార్యనిర్వాహకులు రామాంజులరెడ్డి తెలిపారు. ఉచితంగా రవాణాసౌకర్యం, భోజనం వసతి కల్పించి ఆపరేషన్ చేయిస్తామన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


శ్రీరాములు (ఫైల్)

బత్తలపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లి బీసీ కాలనీకి చెందిన శ్రీరాములు(41) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి బీసీ కాలనీకి చెందిన శ్రీరాములు సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక అప్పులు ఇచ్చిన వారికి ఐపీ నోటీసులు పంపాడు. అప్పులు తీర్చలేనంటూ భార్యతో మదనపడేవాడు. శనివారం రాత్రి అందరూ మిద్దెపై పడుకొని ఉండగా కిందికి దిగివచ్చి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య రామాంజినమ్మ ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంబులపూలకుంట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 'తాటిమాను గుంతలో తాగునీటి కటకట' అనేవార్త ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన విషయం విదితమే. ఈవార్తకు స్పందించిన ఈఓఆర్‌డీ మాధవరెడ్డి గ్రామానికెళ్లి బోరును డ్రిల్లింగ్ చేశారు. పైపులు వేసి, నీటి సమస్య ను పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

'శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పాటుపడదాం'

ధర్మవరంరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో శాస్త్రీయ సమాజనిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్లను వారు ఆదివారం పట్టణంలోని జనవిజ్ఞానవేదిక కార్యాలయం ఎదురుగా ఆదివారం జన విజ్ఞాన వేదిక సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు, యువత జన విజ్ఞాన వేదిక సభ్యత్వాన్ని తీసుకుని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, విక్రాంత్, హెచ్‌ఎం భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

పశువైద్యం.. దైన్యం..

● రూ.వేలు వెచ్చించి ప్రైవేటు దుకాణాల్లో మందుల కొనుగోలు
● పశువుల యజమానుల ఆవేదన



గాండ్లపెంట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెట్ట భూములు అధికంగా ఉన్న ప్రాంతం గాండ్లపెంట మండలం. వర్షాలు అంతంతమాత్రమే. తీవ్ర వర్షాభావంతో తాగునీరు కూడా బరువే. అలాంటి ప్రాంతంలో రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో పాడిపరిశ్రమపైన, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే రోగాల బారిన పడిన పశువులకు సకాలంలో సరైన వైద్యం అందకపోవడంతో తీవ్రంగా నష్టపో తున్నామని పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 14 పంచాయతీల్లో వంద గ్రామాలున్నాయి. అందులో పాడి ఆవులు 7,400, గేదెలు 3,920, గొర్రెలు 70,500, మేకలు 32,250, కోళ్లు 32వేలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా మండల వ్యాప్తంగా 14 పంచాయతీల్లో వంద గ్రామాలున్నాయి. మండల కేంద్రమైన గాండ్లపెంటలో మాత్రం పశువైద్య ప్రధాన కేంద్రం ఉంది. దీనికి అనుబంధంగా నలుగురు గోపాల మిత్రలు విధులు నిర్వహిస్తు న్నారు. దీనికి తోడు గత ప్రభుత్వంలో రెండు పంచాయతీలకు కలిపి ఒక సచివాలయాన్ని, దానికి అనుబంధంగా పశువైద్య సహాయకుడిని నియమించారు. ఈ లెక్కన మండలంలో ఏడు సచివాలయాలు ఉండగా, ఏడుగురు పశువైద్య సహాయకులు ఉండాలి. కానీ మండలకేంద్రంలో ప్రధాన పశువైద్య కేంద్రం ఉండడంతో, అక్కడ మినగా మిగిలిన ఆరు సచివాలయాలకు ఆరుగురు పశువైద్య సహాయకులను నియమించారు. వీరు తమ విధులను సరిగా నిర్వహించడం లేదని, అలాగే గాండ్లపెంట పశువైద్య కేంద్రంలో మందులు అందుబాటులో ఉండవనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. దీంతో మండలంలోని పశువులకు సకాలంలో సక్రమమైన వైద్యం అందక తీవ్రంగా నష్టపోతున్నామని వాటి యజమానుల వాపోతున్నారు.

పశువులకు అందని వైద్య సేవలు

గత ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు అనుబంధంగా నియమించిన పశువైద్య సహాయకులు రోజూ తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి పాడి పశువులను, గొర్రెలు, మేకలు, కోళ్లను ప్రతి రోజు పరీక్షించాల్సి ఉంది. అవసరమైన మందులు ఇవ్వడంతో పాటు, మూగ జీవాల ఆరోగ్యం పట్ల , పాడి వృద్ధి పట్ల సీజన్‌కు తగ్గట్టుగా సలహాలను ఎప్పటికప్పుడు అందిం చాల్సి ఉంది. అయిదే పలువురు పశువైద్య సహాకులు ఆ నిబంధనలను తుంగలో తొక్కి, ఏగ్రామానికి వెళ్లడం లేదని పాడి రైతులు ఆరోపి స్తున్నారు. కానీ రికార్డుల్లో మాత్రం గ్రామాలకు వెళ్తన్నామంటూ నమోదు చేసి సొంత పనుల్లో ఉంటున్నట్లు సమచారం. సచివాలయ పశువైద్య సహాయకులు గ్రామాలను సందర్శించకపోవడంతో పశువులు వ్యాధుల బారిన పడి మృత్యువాత పడిన సంఘటనలు అనేకమున్నాయి. దీం తో పశువులకు వ్యాధులు సోకితే ప్రైవేటు వ్యక్తులను సప్రందించి చికిత్సలుచేయించుకుంటున్నారు. ఇదిలా ఉంటే పశువైద్య సహాయకులంటే తెలియని పాడిరైతులు పలు గ్రామాల్లో చాలామంది ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. గోపాలమిత్రలు, పశువైద్య సహాకులు పలువురు తమకు అనుకూ లమైన వారికి ప్రభుత్వ మందులను అమ్ముకుంటూ, అవసరము న్న పశువులకు సరైన మందులు అందివ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే గాండ్లపెంటలోని పశువైద్య కేంద్రంలో తగిన మందులు అందుబాటులో ఉండడం లేదని పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరులు వాపోతున్నారు. ఇప్పటికైనా పశువైద్యసహాయలు గ్రామాలకెళ్లి పాడి పరిశ్రమకు ప్రోత్సహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పశు వైద్య శాలలో మందులను అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు.

అరకొరగా మందులు



నాకు పాడిఆవులు నాలుగున్నాయి. ఒక ఆవు ధర రూ.70 వేల నుంచి రూ. 90వేలు పలుకు తోంది. పాడిపైనే జీవనం సాగిస్తున్నాం. పాడిపశువులకు వ్యాధులు సోకితే ప్రభుత్వ పశు వైద్యశాలకు వెళ్తున్నాం. కానీ పలుమార్లు వెళ్లినా ఆసుపత్రిలో అరకొరగానే మందులున్నాయి. దీంతో ప్రైవేటు దుకాణాల్లో మం దులు తెచ్చుకుంటున్నాం. ప్రధానంగా పాడి ఆవులకు అవసరమైన పలు మందులు ప్రభుత్వ పశువైద్య శాలలో దొరకడం లేదు. ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నాం. కొంతమంది గోపాల మిత్రలు ప్రభుత్వ మందులు లేవని బయట తెచ్చుకోవాలని చెబుతున్నారు. - ఆదిరెడ్డి, పాడిరైతు, గాండ్లపెంట

గ్రామాలకు ఎవరూ రావడంలేదు



నాకు ఐదు పాడిఆవులున్నాయి. వాటి పాలు అమ్మి జీవిస్తున్నాం. పేడ వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. పాడి ఆవులకు ఏదైనా జబ్బు చేసినా, గత ఐదేళ్ల నుంచి ఏ పశువైద్యాధికారి మా గ్రామాన్ని సందర్శించ లేదు. గత యేడాది దాదాపు రూ. 80వేలు విలువ చేసే పాడి ఆవు అనారోగ్యంతో మరణించింది. పశువైద్యాధికారుల సూచనలు, సలహాలు లేకపోవడంతో పాడి రైతులం రూ. లక్షల్లో నష్టపోతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య సిబ్బంది పాడి పశువులను పరిశీలించి, గ్రామాల్లో అవగాహన కల్పిస్తే ఎంతోఉపయోగకరంగా ఉంటుంది. - ఓబులరెడ్డి, పాడిరైతు, గజ్జలవాండ్లపల్లి

అందుబాటులో ఉన్న మందులు పంపిణీ చేస్తున్నాం

ఆవులు, గేదెలు, గొర్రెలకు ప్రభుత్వం అందిస్తున్న డివార్మింగ్, యాంటిబయాటిక్ మందులు, గాలికుంటు, చర్మవ్యాధి, లేగదూడల్లో నట్టల నివారణ, కోళ్లలో కొక్కర తెగుళ్లు తదితర వాటికి ప్రభుత్వం అందిస్తున్న మందులను పాడిరైతులకు సరఫరా చేస్తున్నాం. అలాగే వ్యాక్సీన్లు వేస్తున్నాం. అందుబాటులో ఉండని పశువైద్య సహాయకులపై చర్యలు తీసుకుంటాం. - చెన్నకేశవనాయక్, పశువైద్యాధికారి, గాండ్లపెంట

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యాలు

● ఎమ్మెల్యే కందికుంట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మొదటి యేడాదిలో అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనించిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభు త్వం మొదటి యేడాదిలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సమాంతరంగా పనిచేసిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరకాలుగా విధ్వంసం చేసిపోతే, దాన్ని మరమ్మతులు చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమాన్ని దారిలో పెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములైన బీజేపీ, జనసేన పార్టీలను కలుపుకుని అన్ని కార్యక్రమాలు చేపడుతున్నామ న్నారు. నియోజకవర్గంలో కూడా మొదటి యేడాది సంతోషంగానే సాగిందన్నారు. సామాన్య ప్రజలు సంతృప్తిగానే ఉన్నారని, వారికోసం తాను చేయాల్సినందతా చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కొంతమంది భూకబ్జాదారులకు, చర్చి ఆస్తుల ఆక్రమణదారులకు ఇది కంఠగింపుగా ఉందన్నారు. తాము అవినీతి అధికారులను దూరం పెట్టామని, ఇంకా కొంత మందిని దూరం చేయాల్సి ఉందన్నారు. సామాన్య ప్రజలు ఎవరి సిఫార్సు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసుకునేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. పట్టణంలో వినాయకచవితికి అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ తీగలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామని, అయితే విద్యుత్ అధికారుల సూచన మేరకు తిరువీధుల్లో టవర్లు ఏర్పాటుచేస్తామన్నారు. తద్వారా వినాయచవితి సమయంలో కరెంటు తొలగించకుండానే ఊరేగింపు కొనసాగేలా చూస్తామన్నారు.

ఎమ్మెల్యేని ఈ వేళల్లో కలవచ్చు

ఎవరైనా తనను సోమ, మంగళ, బుధవారాల్లో పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు కలవచ్చని ఎమ్మెల్యే కందికుంట తెలిపారు. ఆయా రోజుల్లో అత్యవసర పనిమీద బయటకు వెళితే తప్ప అందుబాటులోనే ఉంటానన్నారు. అలాగే గురు, శుక్ర, శనివారాల్లో 'మనింటికి మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో నిర్వహిస్తామని, ఆయా రోజుల్లో ఉదయం 8గంటల నుంచి 11.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 3.30 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రజలు, కార్యకర్తలు, నాయకులు ఈ విషయాన్ని గమనించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఒక వేళ తాను ఇల్లు కట్టుకుంటే తమ అనంతరం ఆ ఇంటిని పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి రాసిస్తానన్నారు. తన కార్యాలయాల్లో పనిచేసేవారు తప్పు చేసినా, వారికి శిక్ష తప్పదని ఎమ్మెల్యే హెచ్చరించారు.

కదిరి-వేంపల్లి బస్సు పునరుద్ధరణ


కదిరి నుంచి నంబులపూలకుంటకు చేరిన వేంపల్లి బస్సు

నంబులపూలకుంట, జూన్8 (ఆంధ్రజ్యోతి): కదిరి నుంచి నంబులపూలకుంట వేంపల్లికి బస్సు సర్వీస్‌ను ఆదివారం పునరుద్ధరించారు. బస్సు నంబులపూలకుంటకు చేరిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మాట్లాడుతూ... చాలా రోజులుగా కదిరి నుంచి నంబులపూలకుంట మీదుగా వేంపల్లి బస్సు సర్వీసును నిలిపివేశారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం నూతన సర్వీస్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సు రోజూ సాయంత్రం 5గంటలకు కదిరిలో బయలు దేరి నంబుల పూలకుంట, తూర్పునడింపల్లి, కడప జిల్లాలోని ఎర్రగుడి మీదుగా వేంపల్లికి వెళ్తుందని తెలిపారు. అలాగే మరసటి రోజు తెల్లవారుజామున 4.45గంటలకు ఇదే దారిగుండా కదిరికి చేరుకుంటుందన్నారు. మరికొమ్మెదిన్నె, జౌకల, తూర్పు నడింపల్లి, గౌనపేట, వెలిచెలమల, వడ్డిపల్లి, కమ్మగుట్టపల్లి ప్రజలకు అనుకూలమన్నారు. బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకి ప్రజలు, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రామగంగిరెడ్డి, సమీవుల్లా, పెద్ద బయ్యప్ప, హనుమంతరెడ్డి, ఇంతియాజ్, బాబాఫకృద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈఏపీసెట్‌లో ధర్మవరం విద్యార్థినుల ప్రతిభ


గాజుల షేక్‌హాప్నా, ఓలేటి వర్షిత

ధర్మవరంరూరల్,జూన్8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థినులు గాజుల షేక్ హాప్నా, ఓలేటి వర్షిత ఈఏపీ సెట్ ఫలితాల్లో సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో గాజుల షేక్ హాప్నా 4654ర్యాంకు, ఓలేటి వర్షిత 5220 ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్, తోటి విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి

● కలెక్టర్ టీఎస్ చేతన్ ● షైనింగ్ స్టార్స్ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తచెరువు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలన్న లక్షంతో ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని వెంకటేశ్వరా కల్యాణ మండపంలో సోమవారం షైనింగ్ స్టార్స్ కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. వాటిని ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా 2024-25 సంవతసరం ప్రభ్రుత్వ విద్యాసంస్థల్లో పదో తరగతి, ఇంటర్ చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డుతో సన్మానించనుందని కలెక్టర్ తెలిపారు. పదో తరగతిలో 83.33 శాతం మించి మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లాలోని ఒక్కొక్క మండలం నుంచి ఆరుగురిని ఎంపికచేసి అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పదోతరగతి విద్యార్థులు 187 మందిని, 38 ఇంటర్ విద్యార్థులను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం సర్టిఫికెట్, మెడల్ తోపాటు రూ.20 వేల చెక్కు అందజేస్తుం దన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులు వారి తల్లిదండ్రులను వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ కిష్టప్ప, ఏపీసీ దేవరాజ్, ఏడీలు లాజర్, శ్రీనివాసులు, ఎంఈఓ జాన్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్షమాపణ చెప్పాలి

● టీడీపీ నాయకుల డిమాండ్
● కొమ్మినేని, కృష్ణంరాజుపై పోలీసులకు ఫిర్యాదు


అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తిరూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన జగన్ సొంత మీడియా ఛానల్ ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకులు వీవీఆర్ కృష్ణంరాజు వెంటనే ఆ మహిళలకు క్షమాపణలు చెప్పాలని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పార్టీ సీనియర్ నాయకులు వారాధి చెన్నకేశవులు డిమాండు చేశారు. జగన్ సొంత మీడియా ఛానల్ లైవ్ డిబేట్‌లో శనివారం ఆ చానల్ ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకులు వీవీ ఆర్ కృష్ణంరాజు దేవతల రాజధాని అమరావతి గురించి మాట్లాడుతూ, మహిళలను కించపరిచే విధంగా అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఎవరైనా మహిళలను కించపరిచేందుకు మాట్లాడితే భయపడే విధంగా గుణపాఠం చెప్పాలన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం వారు స్థానిక నాయకులతో కలిసి అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పిర్యాదుచేసిన వారిలో నాయకులు గంగాధర్ నాయుడు, దయ్యాల ఉమాపతి, అమ్మినేని కేశవనాయుడు ఎంఈఎఫ్ అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి రామ తులసమ్మ, ఆర్పీయూలు గంగమ్మ, లక్ష్మీకుమారి, పుష్ప, దరణి, గాయత్రి, నారాయణమ్మ, ప్రియ, సాయిలీల, శోబారాణి, ఉమామహేశ్వరి, భవాని, జ్యోతి, ప్రతిభ తదితరులు ఉన్నారు.

మహిళలను కించపరచడం హేయం

● టీడీపీ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ తోట వాసుదేవ

ధర్మవరంరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన సొంత మీడియా చానల్‌లో మహిళలను అవమానకరంగా మాట్లాడించడం హేయమైన చర్య అని టీడీపీ హిందూపురం పార్లమెంట్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ తోట వాసుదేవ పేర్కొన్నారు. మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోతారన్నారు. ఆయన ఆదివారం పట్ట ణంలోని టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ... అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే అన్నారు. మహిళలు త్యాగం చేసిన భూముల్లో నిర్మిస్తున్న రాజధాని అమరావతిపై నీ సొంత మీడియాలో ఇష్టానుసారంగా విషం చిమ్మాలని చూస్తే అది మీ తాడేపల్లి ప్యాలెస్ పైనే పడుతుందని అన్నారు. దేవతల రాజధాని అమరావతిని విమర్శించిన జగన్ అండ్ కో.. మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గుంతల రహదారి

● ఇబ్బందుల్లో వాహనదారులు


గుంతలమయమైన కందుకూరివాండ్లపల్లి రహదారి

అమడగూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాబాద్-కందుకూరి వాండ్లపల్లి రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డు ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్ల కిందట తారు రోడ్డు వేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరం ఈ రహదారి ఉంది. నిత్యం పలు వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డు ఆటోలో వెళ్లాంటే నరకం కినిపిస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పాఠశాలలు ప్రారంభమవుతాయి. అప్పటి నుంచి ప్రైవేటు పాఠశాలల బస్సులు ఎక్కువగా తిరుగుతాయి. అలాగే కార్లు, ఐషర్ వాహనాలు, ద్విచక్రవాహనాల సంచారంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల అవస్థలు చెప్పనలవి కాదు. అలాగే రోడ్డుకు ఇరువైపుల చెట్లు పెరిగాయి. దీంతో ఎదురెరుదుగా వాహనాలు వస్తే, ద్విచక్రవాహనాలను కొద్దిసేపు పక్కన నిలిపివేయాల్సి వస్తోంది. పెద్ద వాహనం కదిలిన తరువాత వెళ్లాల్సి వస్తోంది. ఇదిలాఉంటే మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవని వాహనదారులు వాపోతున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదంటున్నారు. ఈ దారిలో నాలుగు గ్రామాల ప్రజలు సంచరిస్తుంటారు. ఈ లెక్కన ఆయా గ్రామాలకు చెందిన 800 కుటుంబాలకు చెందిన వారు నిత్యం సంచరిస్తుంటారని ప్రజలంటున్నారు. రానున్న రోజుల్లో ఎక్కువగా వర్షాలు కురిస్తే, గుంతల్లో నీరు చేరి ప్రయాణం మరింత దుర్భరమవుతుందని అంటున్నారు. ఆ గుంతల్లో ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



గుంతల రోడ్డులో ఆటోలు నడపాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఆటో నడపకపోతే జీవనం సాగదు. అంతేగాకుండా ఆటో నడిపి సంపాదిస్తున్న సొమ్ము మరమ్మతులకే సరిపోతోంది. గుంతల పడిన రోడ్డులో ఆటోలు నడపడం వల్ల అనారోగ్యం పాలవుతున్నాం. గుంతలు పూడ్చి, రహదారి పూర్తి చేయాలి. - సుధాకర్, ఆటో యజమాని

ఈ రోడ్డే మాకు గతి



నిత్యం ప్రతిరోజు ఏ చిన్న అవసరమున్నా, ఎక్కడికి వెళ్లలన్నా నాలుగు గ్రామాల ప్రజలు ఈ దారి గుండా వెళ్లాల్సిందే. గుంతలు పడిన రోడ్డులో వెళ్లాలంటే చాల ఇబ్బందిగా ఉంది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర అడుగడుగున గుంతలు పడ్డాయి. గుంతల వల్ల అనుకున్న సమయానికి గమ్యం చేరుకోలేకపోతున్నాం. మరమ్మతులు చేయించి రహదారిని బాగుచేయాలి. -గండా రమణ, కందుకూరివాండ్లపల్లి

ప్రతిపాదనలు పంపుతాం

గుంతలుగా మారిన రహదారి మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. అనుమతులు వచ్చిన వెంటనే గుంతలు పూడ్చి, తారు వేయిస్తాం. ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తాం. -మునియప్ప, ఎంపీడీఓ, అమడగూరు

యోగాతో మానసిక ప్రశాంతత

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



యోగాంధ్రలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి తదితరులు

మడకశిర టౌన్, జూన్8(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఉదయం 6 గంటలకు యోగాంధ్రను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని తీసుకొన్న నిర్ణయంతో అనేక మంది యోగాపై దృష్టిపెట్టారన్నారు. ఇది మంచి పరిణామమని, యెగాతో ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్, ఎంఈఓ శ్రీనివాస్‌భాస్కర్, డాక్టర్ క్రిష్ణమూర్తి, పతాంజలి యోగా శిక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఇందులో ఆర్డీఓ సువర్ణ పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఏఎస్‌వై గురుజీ సురేష్, ప్రిన్సిపాల్ భక్తవత్సలం పాల్గొన్నారు.

గుండుమలకు గురుసేవారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూన్8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిని గురువారం గురుసేవారత్న అవార్డుతో సత్కరించారు. కర్ణాటక రాష్ట్రంలోని పుణ్యక్షేత్రం సిద్దరబెట్టలో ఆదివారం బాలేహొన్నూరు శాఖ మఠంలో జరిగిన కార్యక్రమంలో రంభాపురి వీరసోమేశ్వర గురువు అవార్డును గుండుమల తిప్పేస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రరైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, కర్ణాటక రాష్ట్ర మంత్రి పరమేశ్వరప్ప, తుమకూరు ఎమ్మెల్యే జ్యోతి గణేష్ తదితరులు హాజరయ్యారు. సామాజిక, సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డును అందించడం జరిగిందని మఠం నిర్వాహకులు తెలిపారు. ఇదే సందర్భంలో ఉచిత సామూహిక వివాహాలు జరిగాయి.

ఎస్పీ బాలుకు ఘననివాళి



నివాళులు అర్పిస్తున్న గాయనీగాయకులు

పరిగి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గాయకుడు బాలుకు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో సీతారామాపురం కాలనీలో బీజేపీ సీనియర్ నాయకులు బంగారు చంద్ర ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. తొలుత బాలసుబ్రహ్మణ్యంకు నివాళులు అర్పించారు. అనంతరం బంగారు చంద్ర మాట్లాడుతూ గానగంధర్వుడగా బాలసుబ్రహ్మణ్యంకు పేరుందన్నారు. ఎటువంటి కార్యక్రమాలకైనా తనను సంప్రదిస్తే తన వంతు సహాయసహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సంగీత విభావరికి స్థానికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గాయని, గాయకులు అనిత, శ్రీనివాసులు, నాగవల్లి, శబరి, ప్రేమ్‌కుమార్, పరిగి శీనా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



ఆవు కళేబరం

హిందూపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మేతకోసం వెళ్లి విద్యుత్ వైరు తగిలి పాడి ఆవు మృతి చెందింది. మిట్టమీదపల్లికి చెందిన సురేష్ ఆవును మేత కోసం ఆదివారం ఉదయం పొలం వద్దకు తోలుకెళ్లాడు. మేత మేస్తున్న సమయంలో విద్యుత్ స్తంభం నుంచి వైరు కిందపడి ఉంది. మేత మేస్తున్న ఆవు ఆ వైరుపైకి వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మృతిచెందిన ఆవు విలువ రూ. 60 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

నేటి నుంచి ఐటీఐ అడ్మిషన్లు

హిందూపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాయపురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9440258629 నంబరులో సంప్రదించాలన్నారు.

చెరువుల మరమ్మతుకు రూ.35 లక్షలు

అధికారులు ప్రతిపాదనలు పంపినా వైసీపీ హయాంలో నిధులు విడుదల చేయని వైనం

అమరాపురం, మడకశిర మండలాలకు కేటాయింపు

మడకశిర,జూన్8(ఆంధ్రజ్యోతి): చెరువుల మరమ్మతులకు రూ. 35 లక్షలు మంజూరయ్యాయి. గత ఐదు సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోని చెరువులకు ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ కింద నిధులు మంజూరుకావడం జరిగింది. గత ఐదు సంవత్సరాల్లో ప్రతి సంవత్సరం చెరువుల మర్మతులకు ఎస్టిమేట్ వేసి ప్రతిపాదనలు పంపడమే తప్ప నిధులు మాత్రం విడుదల కాలేదు. దీంతో దెబ్బతిన్న చెరువులు మరింత దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో పలు చెరువుల కట్టలు బలహీనంగా ఉండడంతో కురిసిన వర్షాలకు గండ్లు పడి నీరు వృథా అయిన సందర్భాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆపరేషన్ అండ్ మెయిన్‌టేనెన్స్ కింద నిధులు మంజూరు చేశారు. ఇరిగేషన్ శాఖ ఏఈ భార్గవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు మండలాలకు రూ.35లక్షలు మంజూరు చేశారన్నారు. అమరాపురం మండలానికి రూ.17.5లక్షలు, మడకశిర మండలానికి రూ.17.5 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో చెరువు గట్లపైన పెరిగిన ముళ్ల కంపలు తొలగించడం, పూడిక తీత, కాలువల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని వివరించారు.

మహిళలను కించపరిచేలా మాట్లాడటం దుర్మార్గం





పెనుకొండలో ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు, హిందూపురంలో ఏఎస్ఐకి ఫిర్యాదు చేస్తూ...

- నిరసనలో తెలుగు మహిళలు
- జగన్ పత్రిక ప్రతుల దహనం

పెనుకొండ టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలను కించపరిచేలా వేశ్యల అమరావతి అని అనడం దుర్మార్గమని తెలుగు మహిళ పెనుకొండ పట్టణ అధ్యక్షురాలు రమణమ్మ మండిపడ్డారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడే జగన్ పత్రికల ప్రతులను దహనం చేశారు. ఆ తర్వాత ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కృష్ణం రాజు నీచంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్ చానల్‌లో ప్రసారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లగా అలుపెరగని పోరాటం చేసిన మహిళలను దూషిస్తారా అని మండిపడ్డారు. మళ్లీ మహిళలు పోరాటాలు చేయాల్సిన పరిస్థితికి తెచ్చారన్నారు. సోషల్ మీడియాలో సైతం ప్రచారం చేస్తున్నారని, ఇది పద్ధతి కాదని హెచ్చరించారు. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో ఎవరూ చేయకుండా వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు శ్రీరాములు, ప్రసాద్, నాయకులు కేశవయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, నూరి, త్రివేంద్ర, సౌకత్, తెలుగు మహిళలు అనసూయ, రమణమ్మ, చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): జగన్ చానల్లో కృష్ణంరాజు, కొమ్మినేని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ తెలుగు మహిళలు మండిపడ్డారు. ఆదివారం హిందూపురం ఒకటవ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ ధనుంజయకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, కౌన్సిలర్ మంజుల మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో ఉన్న మహిళలను అవమానించడం నవ్యాంధ్రుల ఆత్మగౌరవానికి అవమానకరమన్నారు. వేశ్యలుగా చిత్రీకరించిన కొమ్మినేని, కృష్ణంరాజులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. అదేవిధంగా ఆ చానల్ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో విజయలక్ష్మి, చెన్నమ్మ, మాలక్క, వెంకటలక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

నూతన సాంకేతిక పద్ధతులు పాటించాలి

శాస్త్రవేత్త డాక్టర్ మాధవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ త్రికల మాధవి

చిలమత్తూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించేలా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృషివిజ్ఞాన కేంద్ర రెడ్డిపల్లి శాస్త్రవేత్త డాక్టర్ త్రికల మాధవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల ఏఓ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి ఆమెతోపాటు ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ మురుగన్, పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ముఖ్య ఉద్దేశ్యం వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులను వివరించడమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. నూతన పద్ధతులు, వంగడాలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించడం, డ్రోన్ల సహాయంతో మందుల పిచకారి, పంటల సాగులో అనువైన విత్తనాలు, వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేయడం జరుగుతుందని వివరించారు. భూమిని సారవంతం చేసుకునే విషయాలపైనే కాకుండా అధిక మోతాదులో వినియోగించే రసాయనిక ఎరువుల వలన కలిగే అనర్థాలను రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా పశుశాఖ ఉంటుందని, పశుపోషణలో అవసరమైన సూచనలు, సలహాలు ఆయా శాఖాధికారులు రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి పురుషోత్తంరెడ్డి, హార్టికల్చర్ అధికారి మహేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు గోరంట్ల విద్యార్థినుల ఎంపిక



భవిత



సానియా



శ్వేత



గీతాబాయి

గోరంట్ల, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం, బాలికల ఉన్నతపాఠశాల 9వతరగతి విద్యార్థులు భవిత, సానియా, గోరంట్ల బాలికల ఉన్నతపాఠశాల శ్వేత, గీతాబియి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎంలు రామాంజులు, మాలతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 డిసెంబర్‌లో జరిగిన నేషనల్ మీన్స్‌ఆఫ్ మెరిట్ స్కాలర్‌షిపుకోసం పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు ఇటీవల ప్రకటించగా తమ విద్యార్థులు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతియేటా రూ.12 వేల స్కాలర్‌షిప్పు వస్తుందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మాధవిలత, మంజుల, ఉపాధ్యాయులు రాధారమణ, ఈశ్వరప్ప, ఇందిరారమణి అభినందించారు.

స్పందించిన పోలీసులు

ఇంటికి తాళం తొలగింపు



ఇంటి తాళాలు తొలగిస్తున్న పోలీసులు

హిందూపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం గోళ్లాపురం గ్రామంలో గంగమ్మ ఇంటికి వేసిన తాళాలను ఆదివారం పోలీసులు తొలగించారు. గంగమ్మ భర్త హనుమప్పకు అప్పులకుంటకు చెందిన అంజక్క, సుధాకర్ రూ. 50 వేలు అప్పు ఇచ్చారు. అయితే ఐదేళ్ల క్రితమే హనుమప్ప మృతిచెందాడు. ఇప్పటివరకు వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ నెల 5న ఇంటికి తాళం వేశారు. దీంతో గంగమ్మ కుటుంబ సభ్యులు ఇంటి బయటే ఉన్నారు. దీనిపై శనివారం హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం పోలీసులు గోళ్లాపురానికి వెళ్లి ఇంటికి వేసిన తాళాలు తొలగించి గంగమ్మ కుటుంబ సభ్యులను ఇంట్లోకి పంపారు. దీనిపై సీఐ ఆంజినేయులు మాట్లాడుతూ అంజక్క, సుధాకర్ గంగమ్మకు సమీప బంధువులే. అయితే హనుమప్ప బతికున్నప్పుడు అప్పు ఇచ్చారు. దీనిపై గతంలోనే సుధాకర్ జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో ఫోన్ చేసి కూడా చెప్పాడన్నారు. అయితే చట్టపరంగా పోవాల్సింది ఉండగా ఇంటికి తాళాలు వేయడం సరికాదన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత పరిగి ఎలెవన్



పరిగి ఎలెవన్ జట్టు సంబరాలు

పరిగి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కొడికొండ శిరా హైవే సమీపంలోని మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ విజేతగా పరిగి ఎలెవన్ జట్టు నిలిచింది. ఆదివారం టైటిల్ పోరుకోసం పరిగి, కురువ కాలనీ జట్లు పోటీపడ్డాయి. పోటీల్లో పరిగి ఎలెవన్ జట్టు విజయం సాధించింది. విన్నర్స్‌గా నిలిచిన పరిగి ఎలెవన్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ. 10 వేలు, రన్నర్స్‌గా నిలిచిన కురువ కాలనీ జట్టుకు రూ. 5 వేలను స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ ఆర్గనైజర్స్ ఉదయ్, గణేష్, అరుణ్, బాలు, సంజీవమూర్తి, నిఖిల్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి

- కలెక్టర్ టీఎస్ చేతన్

కొత్తచెరువు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని వెంకటేశ్వరా కల్యాణ మండపంలో సోమవారం షైనింగ్ స్టార్స్ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. వాటిని ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా 2024-25 సంవత్సరం ప్రభుత్వ విద్యా సంస్థల్లో పదో తరగతి, ఇంటర్ చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డుతో సన్మానించనుందని కలెక్టర్ వివరించారు. పదో తరగతిలో 83.33 శాతం మించి మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లాలోని ఒక్కొక్క మండలం నుంచి ఆరుగురిని ఎంపికచేసి అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పదోతరగతి విద్యార్థులు 187 మందిని, 38 ఇంటర్ విద్యార్థులను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం సర్టిఫికెట్, మెడల్ తోపాటు రూ.20 వేల చెక్కు అందజేస్తుందన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులు తల్లిదండ్రులతో రావాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ కిష్టప్ప, ఏపీసీ దేవరాజ్, ఏడీలు లాజర్, శ్రీనివాసులు, ఎంఈఓ జాన్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పురాన్ని పరిశుభ్రంగా ఉంచుతాం

టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



మేళాపురం సర్కిల్‌లో శుభ్రం చేస్తున్న నాయకులు

హిందూపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): హిందూపురాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఆదివారం స్వచ్ఛ హిందూపురం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. టీడీపీకి చెందిన యువనాయకులు యుగంధర్, అమీన్, భార్గవ్, నాగేంద్ర, అశోక్, రాజు, నజీర్, శ్రీనివాసనాయుడితోపాటు మరికొంత మంది కమిటీగా ఏర్పడి ప్రతి ఆదివారం పట్టణంలో మూడుగంటలపాటు ఎక్కడ చెత్త పేరుకుపోయిందో అక్కడికి వెళ్లి పరిశుభ్రం చేయడం జరుగుతుందన్నారు. దీని వల్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

కన్వీనర్ శ్రీనివాసులు



శ్రీనివాసులును సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

చిలమత్తూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ఆర్థిక సామాజిక న్యాయం కల్పించింది కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయనను మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మండల యాదవ సంఘం నాయకులు సన్మానించారు. ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మండల కన్వీనర్‌గా ఎన్నికైన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడితే ఎవరికైనా న్యాయం జరుగుతుందినే విషయానికి తానే నిదర్శనమన్నారు. సామాన్య కార్యకర్తగా ఎంతో కాలంగా పార్టీలో కష్టపడ్డానని, అయితే పార్టీ అధిష్ఠానం, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తనను గుర్తించి ఏకంగా మండల కన్వీనర్‌గా ఎంపిక చేశారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పార్టీ కోసం ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పార్టీ గుర్తించి ప్రతి ఒక్కరికి ఊహించని విధంగా న్యాయం చేస్తుందన్నారు.

మంత్రి చొరవతో అభివృద్ధి కార్యక్రమాలు

పెనుకొండ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చొరవతో పెనుకొండ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీడాప్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుందుకు అవకాశం ఇవ్వడానికి నియోజకవర్గాన్ని మంత్రి సవిత పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారన్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పెనుకొండ ఎంపీడీఓ కార్యాలయంలో సీడాప్ అధికారులు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నారన్నారు. సదస్సుకు వ్యాపారులు, ఔత్సాహికులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వండి

ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్కర్స్‌కి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పెనుకొండ వెంకటాపురం తండా పంప్ హౌస్ వద్ద వాటర్ వర్కర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నాయకులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ 25 మంది కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా పెండింగ్ పెట్టారన్నారు. వెంటనే వేతనాలు ఇవ్వకపోతే ఈనెల 24 నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. వారి వేతనాలు కూడా మున్సిపాలిటీ నుంచి చెల్లించి ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, ఉమేష్, రాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూసేకరణపై గ్రామసభ

చిలమత్తూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటులో భాగంగా టేకులోడు రెవెన్యూ పొలంలో చేస్తున్న భూసేకరణపై నేడు ఆ గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, పెనుకొండ ఆర్డీఓలతోపాటు ఇతర అధికారులు పాల్గొనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సచివాలయం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. భూసేకరణకు సంబంధించి పరిహారం, రైతుల అభిప్రాయాలను గ్రామసభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ జాబితాలో పేర్లు ఉన్న రైతులు అందురూ గ్రామసభకు హాజరై వారి అభిప్రాయాలను తెలుపుకోవాలన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం కాలనీకి చెందిన యువకుడు హరినాథ్ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆదిమూర్తి కుమారుడైన హరినాథ్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ తేజశ్వణి చికిత్స చేసి మెరుగైన చికిత్సకోసం 108లో హిందూపురం తరలించారు.

రేపటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

- వ్యవసాయాధికారి తిమ్మప్ప

మడకశిర రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగను మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఇప్పటి వరకు 1903 క్వింటాళ్ల విత్తనకాయలు వచ్చాయన్నారు. విత్తనవేరుశనగ కాయల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఇంకా పేర్లను నమోదు చేసుకోనివారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

హిందూపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇనాయతుల్లా కోరారు. మంగళవారం పుట్టపర్తిలో జరిగే కార్యకర్తల సమావేశానికి పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.